విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 23 సెప్టెంబరు 2025 8 పేజీలు

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన : కలెక్టర్ కీర్తి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. సోమవారం బొమ్మూరు కలెక్టర్ ఛాంబర్‌లో పిసిపిఎన్డిటి చట్టం అమలుపై వైద్య, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. లింగ నిష్పత్తి తక్కువగా నమోదైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ▶మిగతా 2లో..

అర్హులందరికీ 'వాహనమిత్ర'

- దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: వాహనమిత్ర పథకం అర్హుడైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఎంపిడిఓలను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం వాహనమిత్ర పథకం కింద అందిన దరఖాస్తులపై జిల్లా పరిషత్ సీఈఓ, ఎంపిడిఓలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వాహనమిత్ర పథకం కింద అందిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వాహనమిత్ర పథకానికి 11770 దరఖాస్తులు అందాయని, వాటిలో 7581 దరఖాస్తులు ఈ-కెవైసి పూర్తి అయ్యాయని, మిగిలిన దరఖాస్తుదారుల ఈ-కెవైసి పనులు వెంటనే పూర్తిచేసి, అర్హులైన దరఖాస్తుదారుల పరిశీలన వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద అర్హులైన వాహన యజమానులకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృష్ట్యా,గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, పెండింగ్‌లో ఈ-కెవైసి ప్రక్రియ, దరఖాస్తుల పరిశీలనలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, జిల్లాలోని ఎంపిడిఓ లు పాల్గొన్నారు.

దూసుకుపోతున్న లారీలు

- బెంబేలెత్తుతున్న వాహన చోదకులు
- కొవ్వూరు, పోలవరం ఏటిగట్టు రోడ్డుపై ప్రమాద ఘంటికలు
- ఇసుక లోడ్ లారీలతో మరింత ఇబ్బంది

విశాలాంధ్ర - కొవ్వూరు: కొవ్వూరు నుంచి పోలవరం వెళ్లే ఏటిగట్టు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనికి కారణం ఈ రహదారి వెడల్పు తక్కువగా ఉండటం... ఆ పక్కనే గోదావరి గట్టు ఉండడంతో ద్విచక్రవాహన చోదకులైనా, లారీలు, టిప్పర్ల డ్రైవర్లు నిదానంగా వెళ్లాల్సిన ఈ రోడ్డుపై అతి వేగంతో రాకపోకలు సాగించడంతో ఈ రహదారిపై ప్రయాణం.. నరకానికి దగ్గరగా అన్న చందాన తయారైంది. పోలవరంలో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు, తాళ్లపూడి వద్ద కెమికల్ ఫ్యాక్టరీ, బీర్ల ఫ్యాక్టరీ, పోలవరం దగ్గరలో ఆంధ్ర షుగర్స్ వారి అనుబంధ ఫ్యాక్టరీలతో పాటు వివిధ కర్మాగారాలు ఉండడంతో ఈ రహదారుల్లో పెద్ద వాహనాలు దూసుకెళ్లిపోతున్నాయి. ఇదే రహదారి పై రాకపోకలు కొనసాగిస్తున్న ఏటిగట్టు గ్రామాల వారు వివిధ

పనుల నిమిత్తం కొవ్వూరు, రాజమండ్రి ప్రాంతాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో పెద్ద వాహనాల దూకుడు పెను ప్రమాదాలకు కారణ మవుతోంది. ఇటీవల ఈ రహదారిపై జరిగిన సంఘటనలో కొంతమంది తీవ్ర గాయాలు పాలైతే మరి కొంత మంది మృత్యువాతకు గురైన వారు కూడా ఉన్నారు.

రహదారి వెడల్పు ప్రతిపాదన కాగితాలకే పరిమితం

పోలవరంలో ఇందిరా సాగర్ ప్రాజెక్టు నిర్మాణం అవుతున్న సందర్భంగా ఈ రహదారిని వెడల్పు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా అధికారులు చేస్తున్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదనలు అమలుకు నోచుకుంటే ఈ రహదారి మరింత వెడల్పు అవుతుందని ద్విచక్ర వాహనదారులు భావిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లుగా ఇసుక లారీలు.. కొవ్వూరు ఔరంగాబాద్ వాడపల్లి తాళ్లపూడి వేగేశ్వరపురం తదితర పడవల నుంచి తెచ్చేఇసుక రాంపులు మూసివేయడంతో ఆయా ర్యాంపుల వద్ద నుంచి వర్షాలు పడడానికి ముందే ఆరికరేవుల నుంచి అటు పోలవరం వరకు ఉన్న ఏటిగట్టుపై ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి ఇసుకను పెద్ద ఎత్తున నిల్వ ఉంచి అక్కడ నుంచి లారీల్లో లోడ్ వేస్తున్నారు. ఈ లారీలు కూడా పెద్ద ఎత్తున రావడంతో అసలే ఉన్న ట్రాఫిక్ మరింతగా పెరిగింది.

బద్ధకించిన విజిలెన్స్ అధికారులు

గతంలో ర్యాంపులు ▶మిగతా 2లో..

భీమవరంలో బ్లాక్ డే

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చేసి పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం భీమవరంలో కార్మికులు బ్లాక్ డే పాటించి ప్రకాశం చౌక్ సెంటర్లో ఆందోళన నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ హయాంలోనే ఎన్నో పోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నామని కార్పోరేట్ శక్తులకు తలొగ్గి మోడీ సర్కారు వాటిని నాలుగు కోడ్లుగా మార్చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, దేశంలో కార్మిక సంస్కరణలను చర్చించడానికి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాన్ని

వెంటనే నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలాపు శ్రీను, రెల్ల రాము, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన సొబగులతో పాత బస్టాండ్

విశాలాంధ్ర -భీమవరం: చేకూరి రామబద్రిరాజు దాతృత్వంతో భీమవరం పాత బస్టాండ్ సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించినట్లయ్యిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. చేకూరి రామబద్రిరాజు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు శాసన సభ్యులు కామినేని శ్రీనివాస్, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త మంతెన వెంకట సత్యనారా యణ రాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. తొలుత ▶మిగతా 2లో..

విస్సాకోడేరులో స్వస్త్ నారి సశక్త్ పరివార్

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామపంచాయతీ వద్ద స్వస్త్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో

ప్రతిష్టాత్మకంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ బిపి, షుగర్, క్యాన్సర్ మొదలైన వాటికి పరీక్షలతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఈ శిబిరాలలో అందజేస్తామని, రక్తహీనత ఉన్నవారికి పోషకాహారం అవగాహన కల్పిస్తామన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో డాక్టర్ హషిత, ఉపసర్పంచ్ నాగరాజు, కూటమి నాయకులు అప్పారావు, నాగలక్ష్మి, బాలాజీ వర్మ, నానాజీ, గ్రామ సెక్రెటరీ పవన్ కుమార్, వైద్య సిబ్బంది, మరియు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ (స్వాగతోత్సవ వేడుకలు) కార్య క్రమం నిర్వహించి నట్లు కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులన్నింటినీ విద్యార్థులు అందరూ చక్కగా ఉపయోగించు

కొని జీవితంలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని కోరారు. కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొత్తగా చేరిన విద్యార్థులకు సూచించారు. 2024 - 25 సంవత్సరానికి సంబంధించిన విద్యా ప్రగతిని గురించి, విద్యార్థులకు వివరించారు. అన్ని సబ్జెక్టులలో ప్రతిభ కనబరచిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల మెమెంటో సర్టిఫికెట్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో గణపవరం పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ ఆర్.వరలక్ష్మి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె స్వరూప రాణి, కె.వి.గణేష్ కుమార్, డాక్టర్ జి.వెంకట్రావు, డాక్టర్ జివి శారదా దేవి, డాక్టర్ అనురాధ, డాక్టర్ జి.వెంకటరమణ, కె. గిరిబాబు, డాక్టర్ షేక్ పర్వీన్, మోయిన్ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు కేతిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-టి.నరసాపురం: తెడ్లం గ్రామంలో ఇటీవల పెరవలి సరోజిని, శీలం పెద్దింట్లు అనారోగ్యంతో మృతి చెందారు. కేతిరెడ్డి సీతారామరెడ్డి, చంద్ర కాంతమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా వారి కుమారుడు కేతిరెడ్డి

వీరారెడ్డి (చినబాబు) సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలను బిఎల్ఓలు సరిచూడండి

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో 2002 ఓటరు జాబితాలో 2025 ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లను సరి చూడాలని తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక

తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002, 2025లో ఓటరు జాబితాలను బిఎల్వోలు క్షుణ్ణంగా పరిశీలించి, వాటి తేడాల వివరాలను తెలియజేయాలన్నారు. ఎన్నికల డిటి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

◆ పిజిఆర్ఎస్‌కు 306 అర్జీలు

◆ కలెక్టరు కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో కలెక్టరు కె.వెట్రిసెల్వి నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు,ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు యల్.దేవకిదేవి, డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు, నగర పాలక సంస్థ కమీషనరు ఏ.భాను ప్రతాప్, సర్వే ఏడి అన్సారీలు అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మన దగ్గరకు వచ్చిన ఫిర్యాదుదారులతో ఆప్యాయతతో పలకరించి సమస్యలను పూర్తిగా విని చక్కని పరిష్కారం చూపాలని అన్నారు.

పిజిఆర్ యస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు.

ఏ శాఖకు వచ్చిన అర్జీలు ఆయా శాఖ వారు మాత్రమే పరిష్కారం చూపాలని,వేరే

శాఖకు పంపినట్లయితే కాలయాపనలు జరిగి సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. వచ్చిన ప్రతి అర్జీని ఒక ఛాలెంజ్‌గా తీసుకుని పరిష్కారం చేసినట్లయితే జూనియర్ అధికారులకు మంచిస్ఫూర్తి కలుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేటు సూపరింటెండెంట్లు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

లారీలు

(1వ పేజీ తరువాయి)

నడిచేటప్పుడు రహదారిపై ఓవర్‌లోడ్‌తో వెళు తున్న లారీలను ఆపి దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి కేసులు రాయించేవారు. ఇప్పుడు పబ్లిక్‌గా రోడ్డు పక్కనే ఇసుక స్టాక్ పాయింట్లకు ప్రభుత్వ అనుమతి ఉండడంతో ఇసుక నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా పరిమితికి మించి లోడ్ చేసి పంపుతున్నా విజిలెన్స్ అధికారులు అటువైపే చూడటం లేదు.

కారణం ఏమిటో అందరికీ ఎరుకే. పేరుకు కొన్ని ఇసుక పాయింట్లకే అనుమతి ఉన్నా అనధికారి కంగా మరెన్నో ర్యాంపులు నడుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాత బస్టాండ్

(1వ పేజీ తరువాయి)

నూతన ఆర్టిసి కాంప్లెక్స్ లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం నాలుగు ప్లాట్ ఫామ్ లను, శిశువులకు పాలు ఇచ్చే గది, రిజర్వేషన్ అండ్ కార్గో కౌంటర్ లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ భవ్య భీమవరంలో భాగంగా చేకూరి రామభద్రరాజు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో భీమవరం పాత బస్టాండ్ నూతన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను నిర్మించుకోవడం ఎంతో సంతోషించదగిన విషయం అన్నారు. ఏళ్ల తరబడి కనీస మౌలిక వసతులు లేకుండా మహిళలు, పిల్లలు, దూర ప్రాంతాల ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని, వారికి చక్కటి సౌకర్యవంతమైన కాంప్లెక్స్ నిర్మాణానికి ముందుకు వచ్చి పూర్తిచేసిన రామభద్రరాజు వారి హృదయాల్లో స్థానాన్ని సంపాదించు కున్నారన్నారు.

రామభద్రరాజు కుటుంబాన్ని ప్రోత్స హించి కార్యరూపందాల్చేలా చేసిన లయన్స్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజును ప్రత్యేకంగా అభినందించారు. నిర్మాణ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేసిన భీమవరం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి లను అభినందించారు. కార్యక్రమంలో ముఖ్య మంత్రి కార్యక్రమాల సమన్వయకర్త మంతెన వెంకట సత్యనారాయణ రాజు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, భీమవరం ఆర్డీవో, మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.వి.ఆర్. వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కఠినచర్యలు

(1వ పేజీ తరువాయి)

ఆదేశించారు.

నేటి సమాజంలో ఇంకా బాలి కల పట్ల వివక్ష, నిర్లక్ష్యం కొనసాగుతుందని, పసిపాపల హత్యలు, గర్భంలోనే ఆడశిశు వులను నాశనం చేసే ప్రయత్నాలు జరుగుతుండటం ఆందోళనకరమని కలెక్టర్ పేర్కొన్నారు.

బాలికలను సమానంగా గౌరవించకపోతే సుస్థిర సమాజ అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, స్టాఫ్ నర్సులు గ్రామాల్లో గర్భిణీలకు అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాలో మూడు ఆసుపత్రులలో అల్ట్రాసౌండ్ యంత్రాలను నూతనంగా ఏర్పాటు చేసుకోవడానికి కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ కె .వెంకటేశ్వర రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పి. కోమల, డిసిహెచ్ఎస్ ఎం. పద్మ, జిజిహెచ్ వైద్యులు, ఎన్జీవోలు, పిహెచ్సి డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యశిబిరాలు పేదలకు ఉపయోగకరం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : మహిళల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులను ప్రభుత్వ వైద్యులు ముందుగా గుర్తించి ఇచ్చే మందులు వాడటం వలన మహిళలు ఆరోగ్యంగా ఉంటారని వేదాంతపురం గ్రామపంచాయతీ సర్పంచ్ జిటిఎస్ రాజు పేర్కొన్నారు. మండలంలో వేదాంతపురం గ్రామంలో సోమవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్

అభియాన్ వైద్య శిబిరాన్ని బయ్యనగూడెం ప్రభుత్వాసుపత్రి ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ జిటి ఎస్ రాజు, జనసేన పార్టీ నాయకులు అప్పన్న ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో, గ్రామాలలో ఉండే ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరాలలో మహిళలంతా వైద్య పరీక్షలు చేయించు కోవాలని తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సంతృప్తికరంగా ఉంటుందని పేర్కొన్నారు. వైద్యాధికారిణి గీతారాణి మాట్లాడుతూ మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ప్రారంభ దశలో గుర్తించకపోతే చాలా ప్రమాదకరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి. శ్రీను, సూపర్వైజర్ భాష, మరియమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు వినోద్ కుమార్, రవితేజ, యువరాజు, ఏఎన్ఎం మణికుమారి, గంగాదేవి, బేబీ కుమారి, హెల్త్ అసిస్టెంట్లు మోహన్, సుబ్బారావు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర-కైకలూరు: దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కైకలూరులో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవ స్థానంలో సోమవారం దసరా నవ రాత్రుల ప్రారంభోత్స

వంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది భక్తులకు అసౌకర్యం లేకుండా చెయ్యాలని, భక్తులందరికి అమ్మవారి దర్శనం కలిగించాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. భక్తుల కొరకు త్రాగునీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్‌రావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతులివ్వాలి

రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు బాబురావు

విశాలాంధ్ర-ముదినేపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముదినేపల్లి వై జంక్షన్ సెంటర్‌లో ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సేవా నాగ జగన్ బాబూరావు జిల్లా, మండల స్థాయి అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ముదినేపల్లి జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆర్ అండ్ బి అధికారులను అనుమతి

కోసం విన్నవించు కున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసి వారి అభీష్టం మేరకు వై జంక్షన్ రింగ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని జిల్లాకలెక్టర్, ఆర్డీవోతో పాటు తహసీల్దార్ ఎస్‌కె లతీఫ్ పాషా, ఎంపీడీవో వై. రామకృష్ణలకు వినతి పత్రాలను అందజేశారు.

జగనన్న కాలనీలో సౌకర్యాలు కల్పించండి : సీపీఐ

విశాలాంధ్ర- నూజివీడు : నూజివీడు పట్టణ పరిధిలో ఉన్న జగనన్న కాలనీలో నివసిస్తున్న పేద ప్రజలకు ప్రభుత్వం వెంటనే కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీ పట్ల కూటమి ప్రభుత్వం వివక్షత చూపుతోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో అధికారులు పేదలను బెదిరించి జగనన్న కాలనీలో గృహాలు నిర్మింపజేసి, కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణాల్లో అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్న పేదలు అప్పు చేసి గృహాలు నిర్మించుకుంటే ఆ పేదలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. ఇదే సమస్యపై గతంలో సీపీఐ ఆందోళన నిర్వహించినప్పటికీ ప్రభుత్వ అధికారుల్లో కనీస స్పందన లేకపోవడం విచారకర మన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు మదుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరరావు, ఆకునూరి విఫ్లవ్ పాల్గొన్నారు.

మద్యం షాపులను తొలగించండి

విశాలాంధ్ర- నూజివీడు : నూజివీడు మండలం అన్నవరం గ్రామ పరిధిలో ఉన్న బ్రాందీ షాపు వల్ల ఆకతాయిల చేష్టలతో మహిళలు, విద్యార్థినిలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని సీపీఐ ఆధ్వ ర్యంలో నూజి వీడు ప్రొహిబి షన్, ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మహిళల రక్షణ కన్నా మద్యంపై వస్తున్న ఆదాయమే ముఖ్యమని విమర్శించారు.

నివాస గృహాల మధ్య, పట్టణ నడిబొడ్డున మద్యం వ్యాపారం చేస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నా ప్రభుత్వ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గాని చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. సాయంత్రమైతే మందుబాబుల వీరంగం హద్దు పద్దు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం షాపులు ఉన్న ప్రాంతాల్లో మహిళలు, విద్యార్థినిలు వెళ్లాలంటేనే తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నివాస గృహాల మధ్య ఉన్న, మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న మద్యం షాపులను తొలగించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు మదుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరరావు, ఆకునూరి విఫ్లవ్, బాధిత మహిళలు పాల్గొన్నారు.

ఇరిగేషన్ సమస్యలు ఎమ్మెల్యే ధర్మరాజు అసెంబ్లీలో ప్రస్తావన

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో ఇరిగేషనుకు సంబంధించిన ప్రధాన సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు.

కాలువల్లో పూడిక తీసి, కాలువ గట్లు పటిష్టం చేసి, ఆక్రమణలు తొలగించా లని,రెగ్యులేటర్, షట్టర్లు శిథిలావస్థల్లో ఉండటంతో నూతన నిర్మాణాలు చేపట్టాలని కోరారు. తూడు, గుర్రపు డెక్కలను తొలగించు టకు కెమికల్ వాడకుండా పూర్వ పద్ధతులు వినియోగించాలన్నారు. వసూలు చేసిన నీటి తీరువాయి పన్నును ఆయా నీటి సంఘాల పరిధిలో మాత్రమే ఖర్చు చేయాలని ధర్మరాజు కోరారు. ఉంగుటూరు నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే ధర్మరాజు గళం వినిపించిడంపట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బండి రామకృష్ణ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: విద్యార్థి దశలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో తోటి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, సీపీఐ అభిమాని బండి రామకృష్ణ ఆదర్శ జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు విద్యార్థి, యువజన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 12వ తేదీన అనారోగ్యంతో హైదరాబాద్ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందిన బండి రామకృష్ణ సంతాప కార్యక్రమం సోమవారం నాడు ఏలూరు స్ఫూర్తి భవనంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటీయుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షత వహించారు. రామకృష్ణ చిత్రపటానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, రామకృష్ణ సోదరుడు బండి వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ తొర్లపాటి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఎం. క్రాంతి కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి

శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్, పి.సురేంద్ర ఏఐఎస్ఎఫ్ ఏలూరు నగర నాయకులు సిద్ధు, కృష్ణ తదితరులు బండి రామకృష్ణ చిత్రపటం దగ్గర పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. 1970 దశకంలో తణుకు పట్టణంలో హైస్కూల్ స్థాయిలో ఆ తర్వాత పాలిటెక్నిక్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నిర్మాణానికి కృషిచేసిన రామకృష్ణ, తర్వాత ఉద్యోగం చేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో పోరాడారని బండి వెంకటేశ్వరరావు తెలిపారు. రెడ్డి శ్రీనివాస్ డాంగే, శివకుమార్, తొర్లపాటి రాజు మాట్లాడుతూ రామకృష్ణ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థి యువజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొంటూ రామకృష్ణ మృతికి సంతాపం తెలిపారు.

లక్ష్యాన్ని అందుకోవాలంటే కష్టపడాలి

తెలుగు రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్

విశాలాంధ్ర-లింగపాలెం: ప్రతి వ్యక్తి కష్టపడితే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆదాయ పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ మోరంపూడి అనిల్ కుమార్ తెలిపారు. ఉన్నత ఉద్యోగంలో ఉన్న ఈయన లింగపాలెంకు చెందిన వారు. ఈయనను విశాలాంధ్ర కలువగా పలు అభిప్రాయాలు పంచుకున్నారు. సంపన్న కుటుంబంలో పుట్టిన తాను ఉన్నత ఉద్యోగ బాధ్యతలలో ఉండటానికి ప్రధానంగా కష్టపడటమే కారణమని అన్నారు. కష్టపడటానికి పేద,గొప్ప అనే వ్యత్యాసాలు లేవని ధనవంతులైన, పేదవారైనా కష్టపడితేనే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలిపారు. తాను ఈస్థాయిలో ఉండటానికి తన నాన్న సత్యనారా యణ, అన్న రంగదాముచౌదరిల ప్రోత్సాహమని పేర్కొన్నారు. నాన్న నిత్యం గ్రామ అభివృద్ధికి, సమాజ శ్రేయస్సు కోసం తపించే వారని,మా నాన్న ఆశయాలను చూసి నన్నును గ్రామానికి ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నుకున్నారని అన్నారు. ఇప్పుడు గ్రామాలు, పట్టణాలు అనే వ్యత్యాసం లేదని ఇంటర్నెట్ అన్ని ప్రాంతాలలో అందుబాటులో ఉందని దీనివల్ల ఎక్కడున్నా విజయాలను అందుకోవచ్చని తెలిపారు. తాను ఉద్యోగ విరమణ చేశాక సమాజానికి అవసరమైన సేవలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు.

మహిళలు ప్రత్యేక వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: మహిళలు ప్రత్యేక వైద్య శిబిరాలు వినియోగించు కోవాలని బండివారిగూడెం పంచాయతీ సర్పంచ్ నాళం శిరీష తెలిపారు. బండివారిగూడెం సబ్ హెల్త్ సెంటర్ పరిధిలో మండల వైద్యాధికారిణి జె. కల్పనారాణి ఆధ్వర్యంలో సోమవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. మహిళలు పౌష్టికాహారం తీసుకుంటూ కుటుంబ సంక్షేమంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల కోసం మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె తెలిపారు. గర్భిణీ స్త్రీలు డాక్టర్ సలహా ప్రకారం వైద్య పరీక్షలు చేయించుకుంటూ మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాళం కాశీ, పంచాయతీ కార్యదర్శి ఎల్. నాగలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి హెచ్ కె రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలపై ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ దగ్గర చేపట్టనున్న నిరసన జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు పిలుపునిచ్చారు. ఏలూరు సీపీఐ కార్యాలయంలో సోమవారం

విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు చెల్లించాలని, అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించి అన్ని ప్రాంతాలవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్, లెక్చరర్ ,టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు లైబ్రరీలలో ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను అన్ని విభాగాల్లో భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో ఈ అంశాలపై చర్చించి, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈనెల 23న కలెక్టరేట్ వద్ద జరగనున్న నిరసన కార్యక్రమానికి జిల్లాలోని యువత, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్, జిల్లా కోశాధికారి ఎం.క్రాంతి కుమార్, సిద్ధు, కృష్ణ, అనిల్, సునీల్, చందు పాల్గొన్నారు.

ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సభ్యునిగా డాక్టర్ సకుమళ్ల

విశాలాంధ్ర -భీమవరం: డాక్టర్ సిఎస్ఎన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ల సత్యనారాయణను ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కమిటి సభ్యునిగా నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.ప్రసన్న శ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంద ర్భంగా కళాశాలలో

సోమవారం జరిగిన అభినందన సభలో కళాశాల ఛైర్మన్ ముత్యాల రత్నం, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చిడే సత్యనారాయణ మాట్లాడుతూ ఈ అవకాశం తమ కళాశాలకు దక్కడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఇది చాలా బాధ్యతయుతమైనదని ఇటువంటి గౌరవాన్ని కళాశాలకు ఇచ్చినందుకు గాను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసన్న శ్రీ, రిజిస్ట్రార్ స్వామి, స్పోర్ట్స్ బోర్డ్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ఎన్ మూర్తి, ఇతర యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్ర మంలో పాలకవర్గ కోశాధికారి వడుపు గోపి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండి సలీమ్ ఖాన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, హెచ్ఓడిలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న ముగ్గురాళ్ళ వాగు

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముగ్గురాళ్ళ వాగు, జలవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇటీవల భారీ వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని బండివారిగూడెం - మక్కినవారిగూడెం, టి నరసాపురం - మక్కినవారిగూడెం



గ్రామాల మధ్య రెండు రోజుల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మరోసారి ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో ముగ్గురాళ్ళవాగు, జలవాగులు వంతెనపై నుండి పొంగి ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసు సిబ్బంది వాగును పరిశీలించి రోడ్లను నిర్బంధించి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

గ్రామ సమాఖ్యలకు బయోమెట్రిక్ డివైజ్‌లు పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం: స్త్రీనిధి రుణాలు పారదర్శక చెల్లింపులకు బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో గ్రామ సంఘాల సభ్యులకు బయోమెట్రిక్ డివైజ్ లను కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలోని డ్వాక్రా సంఘాలకు ప్రతి సంవత్సరం సుమారు 220 కోట్ల రూపాయలను స్త్రీ నిధి రుణాలుగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రుణాల తిరిగి చెల్లింపులో జరుగుతున్న అవకతవకలను అరికట్టేందుకు, పారదర్శకంగా క్యాష్ లెస్ లావాదేవీలను నిర్వహించేందుకు జిల్లాలోని గ్రామ సంఘాలకు 850 బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డిఓ బి.శివన్నారాయణ రెడ్డి, డిఆర్డిఏ పి.డి ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, గ్రామ సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాలో వర్మీ కంపోస్టు వాడాలి : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: రొయ్యల చెరువుల్లో వర్మీ కంపోస్ట్‌ను వాడి అధిక దిగుబడులను పొందాలని, జిల్లా వ్యాప్తంగా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన వర్మీ కంపోస్ట్ ఎగ్జిబిషన్ ను కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సందర్శించి, ప్రారంభించారు. అనంతరం కిలో ఒక్కింటికి రూ.10 చొప్పున చెల్లించి కొనుగోలు చేసిన రైతులకు 4.5 టన్నుల వర్మీ కంపోస్ట్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ సచివాలయాల ద్వారా కిలో పది రూపాయల చొప్పున చెల్లించి కావలసినవారు వర్మీ కంపోస్ట్ ను పొందవచ్చునని అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో వర్మీ కంపోస్ట్ స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రామ్ నాథ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై విచారణ జరపాలి : డీసీసీ రాజనాల

విశాలాంధ్ర- ఏలూరు : ఎన్నికల్లో ఓటర్ల అవకతవకలపై విచారణ జరిపించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ఓటరు జాబితాలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ రాహుల్ గాంధీ పిలుపు మేరకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఏలూరులోని డిసిసి కార్యాలయం నుండి వసంతమహల్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెూసన్న మాల్ సెంటర్లో ఓటర్ల జాబితాలో అవకతవలకు నిరసనగా సంతకాల సేకరణ జరిపారు. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు నిరసనగా సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఉన్నిమట్ల ఎలిజ, బొడ్డు నోబెల్, మరీదు కృష్ణ, ఆలపాటి నరసింహమూర్తి, పెద్దిరెడ్డి సుబ్బారావు, గౌతు సత్యేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్పెషాలిటీ క్లినిక్స్‌లో మెరుగైన వైద్య సదుపాయాలు

ఆశ్రమం సీఈవో వెల్లడి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ఆశ్రమ హాస్పిటల్‌లోని పలు విభాగాల్లో స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభించినట్లు సీఈవో కే. హనుమంతరావు చెప్పారు. సోమవారం ఏలూరులోని ఆశ్రమం ఆసుపత్రిలో స్పెషాలిటీ క్లినిక్‌ను సీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రం ఆసుపత్రిని ఆశ్రయించే రోగులకు శరీరంలో చెందే మార్పులు, అవయవాల వ్యాధులపై అవగాహన కల్పించడమే ఈ క్లినిక్ ప్రారంభోత్సవ ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. ప్రస్తుత యాంత్రిక జీవన విధానం వల్ల వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే వ్యాధుల కోసం అవగాహన కల్పించి ఆయా వ్యాధులకు ప్రాథమిక దశలోనే చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధతో కూడిన వైద్యం అవసరమనే దిశగా సీనియర్ సిటిజన్ క్లినిక్ ను కూడా ప్రారంభించినట్లు చెప్పారు. ముఖ్యంగా 50 సంవత్సరాలు వయసు పైబడిన వ్యక్తుల్లో అత్యధికంగా మగవారిలో మాత్రమే వచ్చే ప్రోస్టేట్ సమస్యలకు, ప్రోస్టేట్ క్యాన్సర్లకు ప్రత్యేక క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి నట్లు వివరించారు. అరిగిన కీళ్లకు మెరుగైన వైద్యం అందించే దిశగా కీ-హెూల్ ద్వారా లిగమెంట్ సమస్యలకు జాయింట్ కేర్ క్లినిక్ ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రమాదవశాత్తు ఏర్పడిన ఎముకల ఒంపు, వైకల్యం సరి చేయడానికి, డిఫార్మిటీ క్లినిక్ ద్వారా చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. మహిళల కోసం ప్రత్యేకంగా హైరిస్క్ ప్రెగ్నెన్సీ క్లినిక్ ఏర్పాటు చేసి తద్వారా గర్భధారణ సమయంలో ఏర్పడే పలు సమస్యలకు ప్రత్యేక పర్యవేక్షణతో సేవలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ హెచ్ఓడి డాక్టర్ సిద్దేశ్వరి, గైనకాలజి హెచ్ఓడి వందన, ఆర్థోపెడిక్ వైద్యులు రోహిత్, భరత్, యూరాలజి హెచ్ఓడి రమేష్, ప్రదీప్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ హరీష్ గౌతమ్, మెడికల్ సూపరింటెండెంట్ శాంతయ్య, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజరాజన్, బోర్డ్ అడ్వైజరీ మెంబర్ కృష్ణ శేషాద్రి, ఇతర విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : గ్రామీణ ప్రాంతాల్లో అనేక సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాలతో సోమవారం వేలేరుపాడు ప్రధాన సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. పదే పదే సమస్యలు తెలియజేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారం కుమారి, కరటం సీతామహాలక్ష్మి, దాసరి రేవతి, అగరం శారద, పిట్టా సీత, సోడే పార్వతి, లంకపల్లి సుజాత, మడివి పుల్లమ్మ, పూరేం విజయ, మిరియాల సింధూర, చిచ్చుడి శ్యామల, అనూష, మడివి రాజేశ్వరి, జల్లి చిన్నక్క, సోడే మంగవేణి తదితర ఆశాలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : జీలుగుమిల్లి నుండి పి రాజవరం వెళ్లే రహదారి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. చిన్నపాటి వర్షం వస్తే చాలు కల్వర్టు వద్ద రహదారి బురదమయం కావడంతో వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. ఈ రహదారి గుండా నిత్యం అనేక వాహనాలు తిరుగుతుంటాయి. సోమవారం పి రాజవరం నుండి జీలుగుమిల్లి వస్తుండగా కల్వర్టు వద్ద గోతులలో పొగాకు బేళ్లతో వస్తున్న ట్రాక్టర్ దిగబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు గురిచేసింది. ఇకనైనా అధికారులు స్పందించి కల్వర్టు వద్ద రహదారిని నాణ్యతతో నిర్మించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటాకు ఘన సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గంటా త్రిమూర్తులు తొలిసారి పూలపల్లి విచ్చేయడంతో గ్రామస్తులు, సంఘం సభ్యుల నుంచి అపూర్వ స్వాగతం అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లా డుతూ, సంఘం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, చైర్మన్ గంటా త్రిమూర్తులు పదవిని చేపట్టిన వెంటనే తమ సమస్యలను అడిగి తెలుసుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గంటా నర్సింహామూర్తి, జిల్లా అధ్యక్షులు గంటా వెంకన్న, అధ్యక్షులు ముదరకొల సత్యనారాయణ, కోశాధికారి గంటా నాగరాజు, కార్యదర్శి బొక్క ఆదిశేషు, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం అర్జీలు పరిష్కరించాలి

కలెక్టరు చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కా రంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ దేవాలయాల్లో అక్టోబర్ 2 నుండి ప్లాస్టిక్ నిషేధం తప్పనిసరి చేయాలని కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి , డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి 194 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించ కుండా జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం స్వమిత్వ, ఈపిటిఎస్ డాక్యుమెంట్స్ అప్లోడింగ్ ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. స్వమిత్వ సర్వేను వేగవంతం చేసి ఈ నెల 27వ తేదీ నాటికి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేకం దుర్గాప్రసాద్, , తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర-టి నరసాపురం: ఫొటో వీడియో గ్రాఫర్ల సంక్షేమా నికి యూనియన్ కృషి చేస్తుందని ఏలూరు జిల్లా అధ్యక్షుడు చిన్ని తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లూయిస్ దాగూరే ఫొటో వీడియో గ్రాఫర్ల యూనియన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు చిన్ని, నూతన అధ్యక్షులు వాసు, ఉపాధ్యక్షులు మహరాజ్, కార్యదర్శి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మహేష్, కోశాధికారి ఈశ్వర్, కార్యవర్గ సభ్యులు రవి, సునీల్, సాయి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ టి.నరసాపురంలో యూనియన్ ప్రగతి పథంలో పయనిస్తుందని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షుడు వాసు మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటా నని యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ మహరాజ్ మాట్లాడుతూ యూనియన్ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రదీప్, కోసాధికారి మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిబాబు, జిల్లా కన్వీనర్ ఖాన్, అమీర్ బాషా, ప్రసాద్, శివాజీ ఫ్యాక్టరీ, జీలుగుమిల్లి జంగారెడ్డిగూడెం అధ్యక్ష, కార్యదర్శులు, టి నరసాపురం యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

విశాలాంధ్ర- ఉంగుటూరు: గ్రామాల్లో పారిశుధ్యం పట్ల కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉంగుటూరు ఎంపిడీవో జి.ఆర్.మనోజ్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చెత్తాచెదారాలు ప్రజలు రోడ్డుపై పడ వెయ్య కుండా పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిశుభ్రంగా ఉంచి రోడ్డుపై చెత్తాచెదారం లేకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ఆంజనేయ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా నాగార్జునరావు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి ఎంపీడీవోగా సిహెచ్ నాగార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూర్ ఎంపీడీవోగా పనిచేస్తూ దేవరపల్లి ఎంపీడీవో గా బదిలీపై వచ్చారు. సోమవారం ఇన్చార్జ్ ఎంపీడీవో వై రాజారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన ఎంపీడీవో సిహెచ్ నాగార్జునరావు దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు నూతన ఎంపీడీవో సిహెచ్ నాగార్జున రావుకు శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ జి శాంతి సీనియర్ అసిస్టెంట్ కుసుమ జూనియర్ అసిస్టెంట్ తనుజ ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సిహెచ్ నాగార్జునరావు మాట్లాడుతూ దేవరపల్లి మండల పరిషత్‌లో అన్ని గ్రామాలలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా దేవీ నవ రాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : నగరంలోని దేవి చౌక్‌సెంటర్లో అమ్మవారి ఆలయం దగ్గర శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి 92వ దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అత్యంత పవిత్రంగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం లో వేలాది గా భక్తులు పాల్గొని అమ్మ వారికి భక్తితో నీరాజనాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజ, అష్టోత్తర పూజ జరిపించారు. తన చేతుల మీదుగా మంగళ హారతి ఇచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం కమిటీ సభ్యులు పురందేశ్వరికి శాలువా కప్పి, అమ్మవారి ఫోటోను బహుకరించారు.

మార్గాని సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - కడియం : ప్రముఖ తెలుగుదేశం నాయకులు, ఏపీఐఐసీ రాష్ట్ర కమిటీ సభ్యులు మార్గాని సత్యనారాయణ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రముఖ సాహితీవేత్త దేవరపు నీలకంఠరావు అన్నారు. రాష్ట్ర ఏపీఐఐసి సభ్యులుగా నియమితులైన ఆయన్ని కడియపులంకలో సోమవారం పలువురు ప్రముఖులు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి ప్రసాదు, అడపా సుబ్రహ్మణ్యం, బోణం సత్యనారాయణ, ఆకుల సూర్యనారాయణ, చిక్కాల ఈశ్వరరావు, ఉంగరాల వీరభద్రరావు, బొర్రా రామకృష్ణ, ఆకుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జవాబుదారీతనం కలిగిన పౌర సేవలు అందించే క్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హామీ ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో పిజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హోదాలో తొలిసారిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా డివిజన్ మండల సచివాలయ స్థాయిలో పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నామన్నారు. అర్హత కలిగిన అర్జీల పరిష్కారం చూపే దిశలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి వ్యయ ప్రయాసలకి లోనూ కాకుండా ఇంటి వద్దనే ఉండి తమ సెల్ ఫోన్ల ద్వారా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమ అర్జీలస్థితి తెలుసుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ శానిటేషన్ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. వాటర్ ట్యాంకుల శుభ్రత, చెత్త నిల్వలు తొలగింపు వంటి చర్యలను పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామమూర్తి, సీపీవో ఎల్ అప్పలకొండ, డీఎస్పీ శ్రీకాంత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లో ఏంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, పి భాగ్యలక్ష్మీ, డిఎల్‌డివోపి వీణా దేవి, ఏ స్లీవా రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలంలో గల వెంకాయమ్మ పేట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ వెంకాయమ్మ పేట గ్రామ ప్రజలు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు కడియం తహసీల్దార్ ఎం సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ పేట గ్రామస్తులు మాట్లాడుతూ ప్రత్యేక పంచాయతీకి కావలసిన అన్ని అర్హతలు వెంకాయమ్మ పేట గ్రామానికి ఉన్నాయని, ఈ గ్రామం మేజర్ పంచాయితీ అయిన కడియపులంక పంచాయతీలో విలీనమై ఉండడం వలన, కడియపులంక పంచాయతీ కార్యాలయానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఎవ్వరూ సరిగ్గా పట్టించుకోకపోవడం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకాయమ్మ పేట గ్రామం జాతీయ రహదారికి

సమీపంలోనే ఉన్నప్పటికీ, కడియం మండలంలోని అన్ని గ్రామాల కంటే వెనుకబడిన గ్రామంగా వున్నదని, ఈ గ్రామాన్ని కడియపులంక పంచాయతీ నుంచి వేరు చేసి, ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కడియం ఎంపిడిఓ, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తదితరులకు వినతిపత్రాలు సమర్పించినట్లు వారు తెలిపారు.

జీతాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల నిరసన

విశాలాంధ్ర -కొవ్వూరు : దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదు అనే సంధాన ఉంది కొవ్వూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పరిస్థితి. రాష్ట్రమంతటా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఒకటి రెండు తేదీలలో జీతాల చెల్లింపులు జరిగినప్పటికీ కొవ్వూరు మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లింపులు చేయకపోవడంతో సోమవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రోడ్ ఎక్కారు. విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం నందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు రవీంద్ర మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఒక నెల జీతాలు చెల్లించకపోతే రోడ్డుమీద పడవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫైనాన్సులు, కరెంట్

బిల్లులు, ఇలా ఎన్నో ఆర్థిక ఒత్తిడిలకు గురవలసిన పరిస్థితి వస్తుందన్నారు. గత నెల ఒకటో తేదీన చెల్లించవలసిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల జీతాలు ఇప్పటికీ చెల్లించకపోవడంతో దుర్భరమైన పరిస్థితిని అనుభవించాల్సి వస్తుందన్నారు. తక్షణమే జీతాలు చెల్లింపు చేయాలని పారిశుధ్య కార్మికుల జీవితాలను రోడ్డున పడకుండా కాపాడాలని కోరారు ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

టీడీపీ నగర నూతన కమిటీ నియామకం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : టీడీపీ రాజమహేంద్రవరం సిటీ నూతన కమిటీ నియామకం జరిగింది. ఈ మేరకు అందుకు సంబంధించిన ఉత్తర్వులు పార్టీ అధిష్టానం నుంచి నగర టీడీపీ కార్యాలయానికి వచ్చినట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడిగా మజ్జి రాంబాబు, జనరల్ సెక్రటరీ బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షులుగా ఉప్పులూరి జానకీ రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కంటిపూడి శ్రీనివాస్, కరగాని వేణు, మొకమాటి సత్యనారాయణ, కార్యదర్శులుగా కడలి రామకృష్ణ, ద్వారా పార్వతి సుందరి, మహ్మద్ అస్లం, కోశాధికారిగా శెట్టి జగదీష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది పార్టీ కోసం కష్టపడిన వారికి

దక్కిన గౌరవమన్నారు. త్వరలోనే భారీ జనసందోహంతో ప్రమాణస్వీకార చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అందరి ఆమోదంతోనే ఈ కమిటీ నియామకం జరిగిందని వెల్లడించారు. నూతన కమిటీ సభ్యులను నగర టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిక్కి నాగేంద్ర, యిన్నమూరి దీపు, నక్కా దేవివరప్రసాద్, కోసూరి చండిప్రియ, దాస్యం ప్రసాద్, కొల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి : ఆర్డీవో

విశాలాంధ్ర - కొవ్వూరు : మీకోసం లో నమోదు అయిన అర్జీలని నిర్దేశ గడువు లోగా అర్జీదారుల సమస్యలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలనీ కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత తెలియ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ - మీ కోసం వేదికలో వచ్చిన అర్జీలను డివిజన్ పరిధిలోని అధికారులతో కలిసి స్వీకరించారు. ఆర్డీఓ రాణి సుస్మిత మాట్లాడుతూ మీకోసం పిజి ఆర్ఎస్ ద్వారా 9 అర్జీలు వచ్చాయన్నారు. .ప్రజలకు అత్యంత చేరువగా సుపరిపాలన అందించడానికి వివిధ స్థాయిలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్జీల పరిష్కారంలో ఏదైనా జాప్యం అయితే సంబంధిత జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి : తలారి

విశాలాంధ్ర -తాళ్లపూడి : తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో డాక్టర్లు గుర్తించలేని వ్యాధితో మృత్యువాత పడి, గేదెలు కోల్పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతుకు చేసిన మేలేమి లేదని, గత 20 రోజులనుంచి గ్రామంలో గేదెలు వింత రోగం తో మృత్యువాత పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పటికి పూర్తిస్థాయిలో వైద్యం అందటం లేదని అన్నారు. సోమవారం పెద్దేవం విచ్చేసిన తలారి రైతులను పరామర్శించారు. ఆయనతో పాటు వైకాపా నాయకులు తోట రామ కృష్ణ సర్పంచులు పరసు రామరవు, తీగిరిపల్లి వెంకట్రావు, గండి రాంబాబు నాయకులు పిట్ట శ్రీను, కవల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులుపై అర్జీ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు రైతుల వద్ద నుండి లంచాలు డిమాండ్ చేస్తున్నారని అని అదే గ్రామానికి చెందిన నల్లూరి హరిబాబు అనే రైతు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపిడిఓగా అదనపు బాధ్యతలు చేపడుతున్న డిప్యూటీ ఎంపీడీవో కెవిఎస్ఎస్ మూర్తికి అర్జీ సమర్పించారు. ఈ అర్జీలు కవుల రైతులకు సిసిఆర్‌సి కార్డులు కావాలి అంటే ఒకో రైతు వద్ద నుంచి ఒకటి నుంచి రెండు వేలు లంచం డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇది కాక ఏటిగట్టుపై ఉన్న దుకాణాల వద్ద నగదు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు రెవెన్యూ పనులు జరగాలి అంటే లంచం ఇవ్వాల్సిందే అని ఆరోపిస్తూ అర్జీ సమర్పించారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

విశాలాంధ్ర - సీతానగరం: చట్టాన్ని ఉల్లంఘించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, ప్రజల శాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా రౌడీషీట్లు సైతం తెరుస్తామని ఎస్ఐ డి రామ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మునుకూడలి గ్రామానికి చెందిన ఇండిగుమిల్లి ప్రసాద్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన నరుకుర్తి రామలక్ష్మి, ఆమె భర్తను ఉద్దేశపూర్వకంగా అక్రమంగా వారి ఇంటికి వెల్లి ఫిర్యాదుతో దురుసుగా ప్రవర్తించి కావాలనే దాడి చేశాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ముద్దాయిని సెప్టెంబర్ 21న అరెస్టు చేసి, 7వ కోర్టు రాజమహేంద్రవరంలో హాజరు పరచగా 14 రోజుల జ్యూడిషియల్ కస్టడీ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం నిందితుని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించడం జరిగిందన్నారు. ముఖ్యంగా యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి : రామలింగేశ్వర్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఎంతో ముఖ్యమని అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు తరలివచ్చారు. వివిధ సమస్యలపై 20 వినతులు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్‌కి సంబంధించి 4, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 4, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి 7, వార్డు సచివాలయాలకు సంబంధించి 4, రెవిన్యూకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ప్రజా సమస్యల పరిష్కారంకోసం ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తోందని, అర్జీలను నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని అదనపు కమిషనర్ తెలిపారు. అర్జీదారుల సమస్యలను ఓర్పుతో విని మర్యాదపూర్వకంగా స్పందించాలన్నారు. ప్రతి అర్జీపై ఎండార్స్ మెంట్ తప్పనిసరి అన్నారు. అనంతరం ఫీవర్ సర్వేపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంతశాతం పూర్తయిందో అడిగి తెలుసుకు న్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, రెవిన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: సోమవారం రఘుదేవపురం గ్రామ పంచాయితీ పరిధిలో సీతానగరం, రాజమహేంద్రవరం ప్రధాన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో అర్ అండ్ బి ఎస్ ఈ జి కంటూ, ఈ ఈ వెంకటేశ్వరరావు, డి ఈ సతీష్ పనులను పరిశీలించి రోడ్డు గుత్తేదారుడుతో పనుల నాణ్యతపై సూచనలు చేశారు. అలాగే రోడ్డుకి అవసరం అయ్యే మెటీరియల్ అందించే ప్లాంటును పరిశీలించారు. అనేక అవాంతరాలను దాటుకుంటూ రఘుదేవపురం పరిధిలో రోడ్డు మధ్య భాగం నుంచి అటు, ఇటు ఐదు మీటర్ల రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. దీనిపై అనేక అడ్డంకులు వచ్చినా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవతో రోడ్డు నిర్మాణం వేగవంతంగా జరుగుతుంది. ఈ పరిశీలనలో ఏ ఈ వీరన్న బాబు, వర్క్ ఇన్స్పెక్టర్ రమణ, గుత్తేదారుడు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఆరు నెలల శిశువు నుండి వృద్ధుల వరకు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఏలేశ్వరం ఎంపీడీవో సిహెచ్ రవికుమార్‌వర్మ అన్నారు. మండలంలోని ఎర్రవరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్థూలకాయ నివారణ, చెక్కెర, వంటనూనె వినియోగం పై నియంత్రణ ఉండాలన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు విరివిగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిశెట్టి అప్పలరాజు, కూటమి నాయకులు బసా ప్రసాద్, మైరాల కనకారావు, గంగిరెడ్ల మణికంఠ, గ్రామ కార్యదర్శి రామరాజు వర్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ జి చక్రవేణి, అంగన్వాడి కార్యకర్తలు ఎల్ఎల్వి నాగమణి, పి అనంత, ఎన్ అమ్మాజీ, పి చంద్రావతి, కే బుజ్జమ్మ వున్నారు.

జీఎస్టీ తొలగింపు ఖాతాదారులకు శుభపరిణామం

విశాలాంధ్ర - రాజానగరం : బీమా రంగంలో అగ్రగామి సంస్థగా నెలకొన్న భారత జీవిత భీమా సంస్థ(ఎల్ఐసి) పాలసీలపై జిఎస్టి తొలగిస్తూ తమ సంస్థ సీఈవో ఆర్. దొరైస్వామి తీసుకున్న నిర్ణయం తమ ఖాతాదారులకు శుభపరిణామమని ఎల్ఐసి రూరల్ శాఖ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రఘు కుమార్, ఏబిఎం అబ్రహం చక్రవర్తి అన్నారు. జీవిత బీమా, టర్మ్, హెల్త్ పాలసీలపై అదనపు భారంగా నిలిచిన జిఎస్టిను తొలగిస్తూ అధికారకంగా ఉత్తర్వులు రావడంతో జిల్లా కేంద్రమైన రాజ మహేంద్రవరం రూరల్ శాఖలో లియాఫీ యూనియన్ రూరల్ బ్రాంచ్ అధ్యక్షులు ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో బీమా ఏజెంట్లు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్రాంచ్ మేనేజర్ రఘు కుమార్, సభ అధ్యక్షులు ఆదిమూలం సాయిబాబా కలిసి కేక్‌కట్‌చేసిి ఏజెంట్లకు అందించారు. ఈ సందర్భంగా బిఎం, ఏబిఎంలు మాట్లాడుతూ జీవిత బీమా రంగాన్ని మరింత విస్తరించడం, పెట్టుబడులకు ఆకర్షణీయమైన వేదికగా మార్చే దిశగా తమ సంస్థ ప్రతినిధులు తీసుకున్న నిర్ణయాలు వివరించారు. లియాఫీ యూనియన్ రూరల్ బ్రాంచ్ అధ్యక్షులు ఆదిమూలం సాయిబాబా మాట్లాడుతూ పదుకోండు ఏళ్లుగా పాలసీపై జీఎస్టి తొలగించాలని డిమాండ్ చేస్తూ లియాఫి దేశవ్యాప్తంగా చేసిన పోరాట ఫలితమే జిఎస్టి తొలగించారని హర్షం వ్యక్తం చేశారు. జీవిత బీమా,టర్మ్, హెల్త్, డిపాజిట్లు పై తొలిసారి చెల్లించే ప్రీమియంపై 4.5 శాతం నుండి 18 శాతం వరకు గతంలో చెల్లించేవారని,ప్రస్తుతం జీఎస్టి పేరిట చెల్లించే అదనపు భారం తగ్గుతుందన్నారు.సామాన్య ప్రజలకు ప్రీమియం భారం నుంచి ఊరట కల్పించింద న్నారు. ఉద్యోగులు సాయిబాబా, పట్నాయక్, డివో శ్రీకాంత్,లియాఫి యూనియన్ నాయకులు ఐ.రవి కుమార్, వై.రామ్మోహన్, కృష్ణ, ఎం.స్వామి, ఏజెంట్లు,శాఖ సిబంది పాల్గొన్నారు.

జీఎస్టీ తొలగింపుపై ప్రధానికి కృతజ్ఞతలు



విశాలాంధ్ర - అమలాపురం : ఏవోఐ యూనియన్ డివిజనల్ కమిటీ వారి పిలుపు మేరకు ఏవోఐ యూనియన్ అమలాపురం అధ్యక్షులు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన బీమా పాలసీలపై జీఎస్టీ తీసివేయడంపై భారత ప్రధాన మంత్రికి, ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ గల్లీ నుంచి దిల్లీ వరకు అనేక విధాల ఉద్యమాలు చేసిన ఏఓఐ యూనియన్ సెంట్రల్ కమిటీకి జోనల్ కమిటీకి డివిజన్ కమిటీకి బ్రాంచ్ నాయకులకు ఏజెంట్ మిత్రులందరికీ అభినందనలు తెలియజేయడం జరిగింది. అనంతరం జీఎస్టీ డిమాండ్‌ను తొలగింపుపై ఆనంద ఉత్సవాలతో కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకున్నారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రాంచ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ మధు బాబు, మేనేజర్ క్లాస్ ఆఫీసర్స్ శేషగిరి చక్రవర్తి డివో రమేష్ బాబు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పిఆర్‌కె అర్జున్, ఎస్ శ్రీహరి మరియు ఏవోఐ యూనియన్ సెక్రటరీ గుమ్మలూరు వినాయకరావు, ట్రెజరర్ దోమ్మేటి శివ స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అయినవిల్లి నాగేంద్ర కుమార్, నాగ బత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హోమ్‌లోన్ సెంటర్ అమలాపురం

మొదటి అంతస్థు, కె.ఎం.బి. వెడ్డింగ్ వెన్యూ కాంప్లెక్స్, పేరూరు వై జంక్షన్, అమలాపురం - 533 201

స్వాధీనతా ప్రకటన

(చర మరియు స్థిరాస్తుల కోసం)

(APPENDIX - IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (1) ప్రకారం (చర మరియు స్థిరాస్తుల కొరకు) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ,హోమ్‌లోన్ సెంటర్, అమలాపురం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజులలోపు ఆ నోటీసులలో పేర్కొనబడిన మొత్తములను మరియు వాటిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా క్రింద పేర్కొనబడిన ఋణగ్రహీతలను/హామీదారులను కోరుతూ డిమాండ్ నోటీసులను జారీచేశారు. ఋణగ్రహీతలు/హామీదారులు సదరు బకాయి సొమ్మును సదరు సమయములోపుగా తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానికానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు నిబంధనలోని నిబంధనలు 8 %ు% 9తో చదువుకోవల్సిన సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తులను తేది: **17-09-2025**న లాంఛనాత్మక స్వాధీనత తీసుకున్నారు.

వ సంఖ్య	ఋణ గ్రహీత పేరు	అకౌంట్ నెం.	ఆస్తుల వివరములు చిరునామా	13/2 డిమాండ్ నోటీసు తేది	13/4 స్వాధీన నోటీసు తేది	నోటీసు తేదికి చెల్లించవలసిన బకాయి	బ్రాంచి పేరు
1	శ్రీమతి అమలదాసు పోసమ్మ భర్త : శ్రీనివాసు శ్రీమతి ఎ. పాపాయమ్మ భర్త : రామకృష్ణ	40698752888	C-21, F-6 మూడవ అంతస్తు	29.05.2025	17.09.2025	4,55,036/-	కొంకపల్లి బ్రాంచి
2	శ్రీమతి గ్రంధి లక్ష్మి భర్త : అప్పారావు శ్రీమతి గ్రంధి అప్పారావు తండ్రి : సత్యనారాయణ	40858157719	C-22, T-6 మొదటి అంతస్తు	23.05.2025	17.09.2025	4,30,528/-	బ్యాంక్ స్ట్రీట్ బ్రాంచి
3	శ్రీమతి కల్వకొలను వెంకట లక్ష్మి భర్త : రామకృష్ణ శ్రీ కల్వకొలను రామకృష్ణ తండ్రి: బాబూరావు	41618308419	C-15, F-2 గ్రౌండ్ ఫ్లోర్	29.05.2025	17.09.2025	4,07,602/-	మోబిర్లపేట బ్రాంచి
4	శ్రీమతి సత్యవధ అరుణకుమారి భర్త : రాంబాబు శ్రీమతి తమ్మిరి గనమ్మ భర్త : రాజు	40768403099	C-22, T-7 మూడవ అంతస్తు	23.05.2025	17.09.2025	4,44,636/-	బ్యాంక్ స్ట్రీట్ బ్రాంచి
5	శ్రీమతి వేముల రూత కుమారి భర్త : రాజబాబు శ్రీమతి వేముల రూత కుమారి తండ్రి: గంగరాజు	40759923278	C-24, T-4 మొదటి అంతస్తు	23.05.2025	17.09.2025	4,48,452/-	కొంకపల్లి బ్రాంచి
6	శ్రీమతి తటవర్తి రమణి భర్త : సుబ్బరాజు శ్రీ తటవర్తి సుబ్బరాజు తండ్రి : సత్య గోవిందరావు	40780407665	C-26, G-1 మూడవ అంతస్తు	23.05.2025	17.09.2025	4.40,8192/-	పేరూరు బ్రాంచి

ముఖ్యంగా ఋణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులకు సంబంధించిన ఏవిధమైన లావాదేవీలైనా పైన పేర్కొనబడిన బాకీల మొత్తములకు మరియు వాటిపై వడ్డీకి మరియు ఇతర ఖర్చులకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హోమ్‌లోన్ సెంటర్, అమలాపురం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. ఏమైనా చెల్లింపులు ఉన్న యెడల తీసివేయబడును. SARFAESI ACT చట్టం సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు/హామీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడముపకై శ్రద్ధ వహించవలెను. పైన తెలిపిన ఋణగ్రహీతలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు కేటాయించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం సబ్ రిజిస్ట్రార్, అమలాపురం మున్సిపాలిటీ, వై.ఎస్.ఆర్.జగనన్న నగర్, బోడసకుర్రు సర్వే నెం. 128/2లో ఎ. 4.51 సెంట్ల విస్తీర్ణంగల భూమి నందు నిర్మించబడిన టిడ్కో ఇళ్లలోని సదరు ఫ్లాటులను తనఖాగా ఉంచి ఋణ సదుపాయము పొందియున్నారు.

ప్రదేశం: అమలాపురం,
తేది: 22-09-2025

సం/- **అధీకృత అధికారి,**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

'లోక కల్యాణ మేళాలు'

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రధానమంత్రి శ్వానిధి పథకములో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు సామర్లకోట పట్టణ ప్రాంతములో వీధి విక్రయాదారులు కోసం లోక కళ్యాణ మేళాలు నిర్వహిస్తున్నట్లు మెప్మా సియంయం సయ్యద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలు మునిసిపల్ కమీషనరు శ్రీవిద్య అధ్యక్షతన 24న ఉదయం గం.10.00ల నుండి స్థానిక మెప్మా ఆఫీసు నందు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేళాలో అర్హులైన వారికి వీధి విక్రయాదారుల గుర్తింపు, అర్హులైన వారికి బ్యాంక్ ఋణ సదుపాయం, డిజిటల్ పేమెంట్ పై అవగాహన, ఫుడ్ లైసెన్స్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహార విక్రయాలయాలపై అవగాహన కల్పించబ డును. ఈ మేళాలో బ్యాంకు మేనేజర్లు, ఆరోగ్యశాఖ, ఫుడ్ లైసెన్సింగ్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొంటారన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో లయన్స్‌క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై డెమో ప్రదర్శన ద్వారా అవగాహన సదస్సు జరిగింది. సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక చికిత్సపై అవగాహన పెంచుకోవాలని అది తనకే కాకుండా ఇతరులు ఆపదలో ఉన్నప్పుడు తగిన రీతిగా స్పందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ ప్రథమ చికిత్స శిక్షకులు సిహెచ్ చిన సత్యనారాయణ మాట్లాడుతూ, తేనెటీగల కుట్టడం, పాము కాటు, విష ప్రయోగం, పొగలో చిక్కుకుపోవడం, ఉరి వేసుకోవటం, నీటిలో మొనగాటం, గొంతులో వస్తువులు చిక్కుకోవడం, కరెంట్ షాక్, పిడుగుపాటు, తేలుకాటు తదితర సమయాల్లో బాధితుడుని రక్షించుటకు డిఆర్ఏబిసి అనే ఫార్ములా ద్వారా బాధితుడనే స్పృహలోకి రప్పించి వెంటనే హాస్పటల్లో జాయిన్ చేసిన ఎడల బాధితుడుని ప్రాణాలు కాపాడవచ్చు నని, ఎటువంటి సమయాల్లో సిపిఆర్ చేయాలో కార్యక్రమమునకు హాజరైన సభ్యులకు మంచి అవగాహన డెమో(ప్రదర్శన) చేసి చిన సత్యనారాయణ కల్పించినారు. క్లబ్ అధ్యక్షులు ప్రసాద్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, క్లబ్ సభ్యులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింత పల్లి సుబ్బారావు, సూర్యనారాయణ, వాసంశెట్టి రాజేశ్వరి, వాసంశెట్టి విజయానంద్, రామ కృష్ణారెడ్డి, ఎస్ వెంకటేశ్వర్లు, రేలంగి బాపిరాజు, నిమ్మకాయల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : జేసీ

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసు, సీపీవో పీ త్రినాథ్, డీపీవో రవికుమార్, కెఆర్సీసి ఎస్డీసీ జి రత్నమణి ఇతర అధికారులతో కలిసి హాజరై కాకినాడ చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఆన్ లైన్ సమస్యలు వంటి

అంశాలకు చెందిన మొత్తం-415 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఆయా శాఖల్లో నమోదైన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్‌కి పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల నమోదు, అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వేత్త లతేంద్రకు ప్రశంసలు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఎన్నో స్వచ్ఛంద సేవలు అందించి అందరికి మార్గ దర్శకుడుగా ఉంటున్న సామాజికవేత్త ముదునూరి లతేంద్ర వర్మను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ సోమవారం తన చాంబర్‌లో అభినందించారు. ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు లతేంద్ర వర్మ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ట్రస్ట్ ద్వారా రూ.15 లక్షలతో బాలికల సమీకృత వసతి గృహం ఆధునీకరణ పనులు, కోటి రూపాయలతో ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణం తమ ట్రస్ట్ ద్వారా చెపట్టాలనుకోవడం హర్షనీయమన్నారు. లతేంద్ర నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు ప్రభుత్వ పరంగా ఎ సహాయ సహకారాలు కావాలి అన్నా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. లతేంద్ర చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లోవున్న రూ.6400 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యు) డిమాండ్ చేసింది. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఆర్ఓకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలకు మద్దతుగా యువగళం పాదయాత్రలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిలోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పెండింగ్‌లోవున్న అన్ని రకాల ఫీజు బకాయిలను మాఫీ చేస్తామని ఏ ఒక్క విద్యార్థికి అన్యా యం జరగనివ్వమని హామీ ఇచ్చారన్నారు. నేడు అధికారం లోకి రాగానే ఇచ్చిన హామీలు మర్చిపోయి ప్రైవేట్ యాజ మాన్యాలు విద్యార్థులు అవస్థలు పడుతుంటే ప్రభుత్వాన్ని కనపడట్లేదని కంటేపల్లి నరేంద్ర ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి పేజీలు చెల్లించాలని, విద్యార్థు లకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ఓజీ తొలి టికెట్‌కి రూ. 60 వేలు ...దసరా ఉత్సవాలకు విరాళం

విశాలాంధ్ర - అమలాపురం : పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ సినిమాపై అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ నెలకొంది. అమలాపురం లలిత థియేటర్‌లో సోమవారం బెనిఫిట్ షో తొలి టికెట్ కోసం నిర్వహించిన వేలంపాట హోరాహోరీగా సాగింది. వేలంపాటను పవన్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించగా, బీజేపీ నేత మోకా వెంకట సుబ్బారావు, జనసేన నాయకుడు గుర్రం కృష్ణ (జీకే) మధ్య పోటీ జోరందుకుంది. చివరికి తొలి టికెట్‌ను జీకే రూ.60 వేలకు దక్కించుకున్నారు. ఈ మొత్తానికి అభిమాన సంఘం మరో రూ.10 వేలు జోడించి మొత్తం రూ.70 వేలను దసరా ఉత్సవ కమిటీలైన కొంకాపల్లి, మహిపాల వీధి, గండు వీధి, రవణం వీధి, రవణం మల్లయ్య వీధి, నల్లా వీధి, శ్రీరామపురంలకు విరాళంగా ఇవ్వనున్నట్లు అభిమాన సంఘం అధ్యక్షుడు, హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్‌డియస్ ప్రసాద్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ఆశయాల మేరకు సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా దసరా ఉత్సవాలకు మద్దతు ఇస్తున్నాం" అని ఆయన అన్నారు. కార్యక్రమంలో మెగా అభిమాన సంఘ నేతలు నల్లా చిట్టిబాబు, నల్లా నాయుడు, థియేటర్ మేనేజర్ త్రినాథ్, దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, అభిమానులు నల్లా యువ నాయుడు, పనస మనోజ్, దాసిరెడ్డి పవన్, మోటూరి కిరణ్, సత్తి చిన్నా, శ్రీకాంత్, తేజ, హరి, యస్‌యస్‌వి, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్ల ప్రతిపాదన ప్రభుత్వానికి నివేదిస్తాం

విశాలాంధ్ర - మామిడికుదురు : మార్కెట్ కమిటీ నిధులతో లింకు రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని నగరం మార్కెట్ కమిటీ చైర్పన్ పెనుమాల లక్ష్మి తెలిపారు. ఏఎంసీ కార్యాలయంలో సోమవారం జరిగిన పాలక వర్గం సమావేశానికి లక్ష్మి అధ్యక్షత వహించారు. దీనిపై సభ్యుల నుంచి వచ్చే ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యే గిద్ది సత్యనారాయణ దృష్టికి తీసుకు వెళ్లి దీన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వీటితో పాటు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాల నిర్వహణ తదితర అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జూలై, ఆగస్టు నెలల్లో మార్కెట్ కమిటీకి రూ.22 లక్షలు ఆదాయం వచ్చిందని ఇంచార్జ్ కార్యదర్శి జి ప్రదీప్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ గుడాల వెంకటరమణ, సభ్యులు జాలెం రమణకుమారి, కుంపట్ల మల్లి ఖార్జునరావు, కందిబోటి సత్య ఈశ్వరి, లూటుకుర్తి సత్యనారాయణ, నూకల విశ్వేశ్వరరావు, పెంట ఏసుకుమారి, అడబాల నాగమణి, చిట్టాల రామజోగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

విశాలాంధ్ర - పెదపూడి : స్వచ్ఛ హి సేవలో భాగంగా పెద్దాడ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ఇంచార్జ్ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. సోమవారం పారిశుధ్య కార్మికులకు ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్ పి సుకుమార్, పురుషోత్తం, ఆశాలు సంయుక్తంగా సాధారణ వ్యాధులైన షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, చర్మ వ్యాధులు వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో మన్యం శ్రీనివాసరావు చౌదరి, ప్రధానోపాధ్యాయులు మూర్తి పాల్గొన్నారు.

సూర్య శ్రీనివాస్‌కు టైమ్ బిజినెస్ అవార్డు

విశాలాంధ్ర - కరప : కరప మండలం కరప గ్రామానికి చెందిన పోడపు నీడి సూర్య శ్రీనివాస్‌కు టైం బిజినెస్ అవార్డు అందుకున్నారు. 2025 సంవత్సరానికి ఐకానిక్ లగ్జరీ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ విభాగంలో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించిందని శ్రీనివాస్ తెలిపారు. ఈ అవార్డును సినీనటి రాశి ఖన్నా చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని మీడియాకు తెలిపారు. పిక్సెల్ గ్యారేజ్ ప్రొడక్షన్ తక్కువ కాలంలోనే వెడ్డింగ్ ఫోటోగ్రఫీ రంగంలో తనదైన ముద్ర వేసి ఈ అవార్డుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - మండపేట : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న శాశ్వత, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ అంబటి రాజారత్నం ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలలో భాగంగా సోమవారం విద్యుత్ ఉద్యోగులు జిల్లా కేంద్రం అమలాపురంలో నిరసన చేపట్టారు. ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నల్ల వంతెన నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు.

కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు పట్టుకొని తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అంబటి రాజారత్నం, అంబేద్కర్ కోనసీమ జిల్లా జేఏసీ చైర్మన్ మట్టపర్తి వెంకటరమణ, జేఏసీ నాయకులు పిఎస్ఎస్ వెంకటేశ్వ రరావులు మాట్లాడుతూ కొంతకాలంగా పెండింగ్‌లోవున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15 నుంచి 22 వరకు వివిధ రూపాల్లో నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. గడచిన కొన్నేళ్లుగా విద్యుత్‌శాఖ సిబ్బందికి పెన్షన్, వేతన సవరణలు, భద్రతా నిబంధనలు, ప్రమోషన్లలో సమానత్వం వంటి అంశాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తమ డిమాం డ్లను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉద్యతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రం లోని అన్ని విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఐక్యంగా పాల్గొని తమ హక్కులను సాధించుకోవాలని వారు పిలుపునిచ్చారు. జేఏసీ నాయ కులు వేగుళ్ళ వీర్రాజు, అడపా వెంకటేష్, వియ్యా రాజ్ కుమార్, వినకోట వాసు, విద్యుత్ ఉద్యోగులు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభల దృశ్య మాలిక

చండీఘర్‌లో జరుగుతున్న సీపీఐ 25వ జాతీయ మహాసభల్లో ప్రతినిధులుగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తదితరులు.

అమర వీరుల స్తూపం వద్ద సీపీఐ రాష్ట్ర నాయకులు ఆర్.రవీంద్రనాథ్, చలసాని రామారావు, యస్. వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఆవుల శేఖర్ విప్లవ జోహార్లు అర్పిస్తున్న దృశ్యం. -విశాలాంధ్ర -భీమవరం

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు, వ్యాపారులకు ప్రయోజనం : ఎంపీ

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు: ఎన్డీయే ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన జీఎస్టీ శ్లాబుల మార్పు దేశ ఆర్థిక రంగంలోనే కీలక సంస్కరణగా నిలుస్తుందన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న నాలుగు శ్లాబుల విధానాన్ని మార్చి,28%, 12% శ్లాబ్ లను పూర్తిగా ఎత్తివేస్తూ 5%, 18% శ్లాబులు మాత్రమే ఉండేట్లు తీసుకువచ్చిన సంస్కరణలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఎంపీ చెప్పారు. పాలు, పాల ఉత్పత్తులపై జీఎస్టీను పూర్తిగా తీసివేయడం, 12 శాతం పన్ను పరిధిలో ఉన్న 99 శాతం వస్తువులు జీరో శాతానికి తగ్గించడం, షాంపూ, టూత్‌పేస్ట్, తలనూనెలు, సబ్బులు, నెయ్యి, వంటపాత్రలు వంటి అనేక నిత్యావసర వస్తువులపై పన్ను 5 శాతానికి తగ్గించడం ప్రజలకు నిజమైన పండుగేనన్నారు. ఈ మార్పుల వల్ల కొనుగోళ్లు పెరుగుతాయని, దీంతో డిమాండ్, ఉత్పాదకత పెరిగి, తద్వారా కొత్త ఉద్యోగాలు వస్తాయని, దీనితో వ్యాపారులకు, నిరుద్యోగ యువతకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జీఎస్టీ శ్లాబులు తగ్గిస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందనలు తెలియచేసారు. జీఎస్టీ సంస్కరణల వల్ల మన రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ. 8 వేల కోట్ల నష్టం కలిగే పరిస్థితి ఏర్పడినా.. పేద ప్రజలు,చిన్న వ్యాపారుల ప్రయోజనం కోసం సంస్కరణలను స్వాగతిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఉదార మనస్తత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, అటువంటి ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. పోలీసు శాఖ ఎప్పుడు కూడా నేరుగా కాగితం రూపంలోనే అధికారిక అరెస్టు చేస్తుందనే విషయాన్ని ప్రజలు గమనించాలని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన డిజిటల్ అరెస్ట్ అనే విషయాలపై ఎస్పి ప్రజలకు అవగాహన చేశారు. గత కొద్దికాలంగా సైబర్ నేరగాళ్లు 'డిజిటల్ అరెస్ట్' అనే కొత్త తరహా పద్ధతిని ఉపయోగిస్తూ నిరపరాధులను మోసం చేసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. నేరగాళ్లు తాము పోలీసులు, సీబీఐ, ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు లేదా ఇతర చట్ట అమలు సంస్థల అధికారులని చెప్పి వీడియో కాల్ ద్వారా మీపై కేసులు ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడతారని చెప్పారు. ఆ తర్వాత అరెస్టు ఆర్డర్ జారీ అయినట్లు చూపించి ఇంటర్నెట్ ద్వారా అరెస్టు చేశామని చెప్పి బాధితులు భయపడేలా చేసి డబ్బులు బదిలీ చేయించుకుంటారని వివరించారు. అంతేకాకుండా వీడియో కాల్, వాట్సాప్ లేదా సోషల్ మీడియా ద్వారా అరెస్టు జరిగే పరిస్థితే లేదని, ఎవరి మీద అయినా కేసు ఉంటే అది అధికారిక పద్ధతుల్లో మాత్రమే తెలియజేస్తారని వివరించారు. ఈ తరహా బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు వచ్చిన వెంటనే 112కి కాల్ చేయడం లేదా మీకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ కిషోర్ ప్రజలకు సూచించారు.

4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం సాయంత్రం బొమ్మూరు కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ సన్నాహక సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఈ సీజన్‌లో 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, అందులో 4 లక్షల మెట్రిక్ టన్నులను ప్రభుత్వమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గత ఖరీఫ్‌లో 2.57 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ జరిగిందని గుర్తుచేస్తూ, ఈసారి అక్టోబర్ 10 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవు తాయని తెలిపారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి రూ.2,389 (100 కేజీలకు), సాధారణ రకం ధాన్యానికి రూ.2,369 (100 కేజీలకు) కనీస మద్దతు ధరగా నిర్ణయించారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 74% పంట నమోదు పూర్తయిందని, మిగిలిన నమోదు తక్షణమే పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు కేవైసీ తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. గత సీజన్లో 221 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ఈసారి పంట దిగుబడి అంచనాల ఆధారంగా కేంద్రాల సంఖ్య నిర్ణయిస్తామని తెలిపారు. గన్ని బ్యాగులను కనీసం 10 రోజులు ముందే అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆకస్మిక వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా తహసీల్దార్లు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో టార్పాలిన్లు అందించాలన్నారు. ప్రతి సేకరణ కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు నియామకాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం రవాణా వాహనాలకు GPS పరికరాలు తప్పనిసరిగా అమర్చాలని, మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. టి. సీతా రామమూర్తి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. మాధవరావు, డీఎం సివిల్ సప్లై బి. గణేష్ కుమార్ , జిల్లా పౌర సరఫరాల అధికారి వి పార్వతి, , జిల్లా సహకార అధికారి ఎమ్ వెంకట రమణ, మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎమ్ సునీల్ వినయ్ పాల్గొన్నారు.

ఆయుధ డిపో నిర్మాణంపై అపోహలు వద్దు : బొరగం

విశాలాంధ్ర బుట్టాయగూడెం : ఆయుధ డిపో నిర్మాణంతో నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది.ఈ ప్రాజెక్టుతో ఏలూరు నియోజకవర్గానికి మంచి పేరు వస్తుంది. ఈ ప్రాజెక్టుతో స్థానిక గిరిజనులకు అన్ని రకాలుగా మేలు జరుగుతుందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు స్పష్టం చేశారు. మండలంలోని బుసరాజు పల్లి గ్రామంలో నియోజవర్గం క్యాంప్ కార్యాలయం నందు సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం గ్రామ పంచాయతీలో ఆయుధ డిపో నిర్మాణం పూర్తి అయితే పోలవరం నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలుకు యువతకు జీవనోపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రూ. 2వేల 500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మించాలని కేంద్రం చూస్తుం దన్నారు. పోలవరం నియోజ కవర్గంలో నౌకాదళ ఆయుధగారం ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్రంతో సంప్రదింపులు చేసి గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచేలాగా ప్రయత్నాలు చేస్తున్నారని తెలియజేశారు. అన్ని రకాల ఉద్యోగాలు స్థానికులకే వస్తాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పోలవరం నియోజవర్గం రూపు రేఖలు మారిపోతాయని అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. కొంత మంది స్వార్థపరులు తమ స్వార్థం కోసం ఈ ప్రాజెక్టును అడ్డుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో జీసీసీ డైరెక్టర్ మడకం కన్నపరాజు, కాకి లక్ష్మి,ఎస్.టి., సెల్ రాష్ట్ర కార్యదర్శి లు గొంది నాగేశ్వరరావు, మొడియం సింగరాజు, జనసేన మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు,జిల్లా అధికార ప్రతినిధి జారం చాందిని, బుట్టాయగూడెం మండలం ఉపాధ్యక్షులు కేరం వెంకటేశ్వరావు, పాయం అరుణ్ దువ్వెల. దుర్గారావు, కారం సురేష్, పైదా వసంతరావు,కొమరం మల్లేశ్వరావు, తెల్లం వెంకటేశ్వరరావు,కుంజం గంగులు, మొట్టం రమణ తదితరులు పాల్గొన్నారు.

ఔను..ఆ రెండు పార్టీలు కలిశాయి..

కథ సుఖాంతం.. కలిసిమెలిసి నడుద్దాం.. జనసేన- టీడీపీ వివాదం పరిష్కారం

విశాలాంధ్ర - కొవ్వూరు : ఔను.. ఆ రెండు పార్టీలు కలిసాయి. నిన్నటి మొన్నటి వరకు ఉప్పు నిప్పులా ఉన్న ఆ రెండు పార్టీల నాయకులు ఒకచోట కలిసి పార్టీలో జరిగిన ఘటనపై మాట్లాడుకున్నారు, దీనికి వేదికగా రాజమండ్రిలోని జనసేన కార్యాలయం నిలిచింది. ఈ కార్యాలయంలో జనసేన తరఫున మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ తరఫున కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తమతమ అనుచరులతో కలిసి కూర్చుని మాట్లాడుకున్నారు. ముందు రెండు పార్టీల్లో ఇటువంటి ఘటనలు జరగకూడదని నచ్చచెప్పుకున్నారు. దీంతో ఇరు పార్టీల నాయకులు కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు సుంకర సత్తిబాబు, చాగల్లు మండలం అధ్యక్షులు ఉప్పులూరు చిరంజీవి, తాళ్లపూడి మండల అధ్యక్షుడు గంట కృష్ణ, మద్దూరి సర్పంచి ఉప్పులూరి బాబ్జి, ప్రధానకార్యదర్శి మైగాపుల బాలకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గంగు మల్లస్వామి, కొప్పాక విజయ్ కుమార్, పెరుగు సాంబశివరావు, తేజ చౌటుపల్లి శివ, ప్రభాతే చంద్ర, డి ప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి : ఎస్పీ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం', (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం తూర్పు గోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్ పి డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెను వెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి, ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవల సినదిగా ఉత్తర్వులు యిచ్చారు. సోమవారం పోలీసు 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం' కార్యక్రమానికి 40 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి సుబ్బరాజు పాల్గొని అర్జీలను స్వీకరించారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

E.P. 15/2022 in O.S. 20/2015

Between:

బత్తుల సత్యనారాయణ ...DHr

మరియు

గువ్వల రామారెడ్డి,
S/o. అబ్బులు, డో.నెం.11-2-2, హెడ్‌పోస్టాఫీసు ఎదురుగా, పెద్దాపురం రోడ్డు, సామర్లకోట. ...JDr

పై నెంబరు పిటీషన్‌లో JDrకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టువారి ఎదుట **ది. 23-09-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥ల** స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

BINDU SREE VEMURI
MVJR ASSOCIATES, Advocates
Flat No. B-1, Pydah Heights - II,
Ungaralavari Street, Salipeta,
KAKINADA. Cell: 94916 24206

రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిని పట్టించుకోరా..?

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమండ్రికి దిశ వున్నా దశ లేకుండా పోయిందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారంతపు సమావేశంలో ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు మాత్రమే రాజమండ్రిది కార్పొరేషన్ స్థాయి ఆసుపత్రి అని, ఆచరణలో మాత్రం మురికి కూపం అన్నారు. రాజమండ్రి కి వచ్చే అధికారులు రాజమండ్రి అభివృద్ధి సుందరికరణ కన్నా వారు సుందరలుగా మారుతున్నారనీ, పౌరులపై ఆప్యాయత లేదు, ఏ విభాగం లోనూ పౌర సేవలు అమలు కావనీ, ఎందుకోసం నగర పాలక సంస్థ వున్నదో నగర పౌరులకు అర్థం కాదనీ, ఏ పనికైనా ముడుపులు చెల్లిం చాల్సిందేనని, లేకుంటే సంవత్సరాలు గడి చినా ఆపని కాదని విమర్శించారు. కొన్ని కార్పొరేషన్ పబ్లిక్ స్థలాలను మాల్స్‌కు ఉపయోగ పడే విధంగా ప్రైవేట్ పార్కింగ్ లకు దారదత్తం చేసి లక్షల్లో అవినీతి సొమ్ములు ఆర్జిస్తున్నారని, పారి శుధ్య మురుగు కంపుతో ప్రజలు అసౌకర్య జీవితాలు గడుపుతున్నారని, దోమలు నిర్మూలనకు సైతం నాణ్యమైన మందు కొట్టకుండా వాటిలో కూడా జేబులు నింపుకుంటు న్నారన్నారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి పేరుకు మాత్రమే పెద్ద ఆసుపత్రి అని, ఇక్కడ వైద్య సేవలు మాత్రం రోగులకు అందవని, జనరల్ వార్డులు , సెప్టిక్ వార్డుల పరిస్థితులు వర్ణనాతీతమన్నారు. ఇంత దారుణమైన స్థితిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కోల్పోయే విధం గా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రాజమండ్రి నగర పాలక సంస్థకు నేటి వరకు విడుదల చేసిన నిధులు పైన , నివాసితులు, వ్యాపారస్తుల నుండి వసూలవుతున్న పన్నులు పైన, నగర అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు పైన స్పష్టమైన శ్వేతపత్రం విడు దల చేయాలని, రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న అక్రమాలను రూపుమాపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సభకు ఆర్పిసి సెక్యులర్ మేడిచర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

బాధితుల తరుపున నిలబడటం నేరమా...

విశాలాంధ్ర - కాకినాడ : ఉప ముఖ్యమంత్రి బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడే నాయకుడు పవన్ కళ్యాణ్ నచ్చి జనసేన పార్టీ తరఫున గత ఎన్నికల్లో కుటుంబాలను సైతం పట్టించుకోకుండా కేవలం జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ ఎదుగుదలే లక్ష్యంగా పనిచేసిన జన సైనికులకు జనసేన వీర మహిళలకు కాకినాడ నగరంలో వారికి ఏ కష్టం వచ్చిన ఆనందం వచ్చిన ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్న సమయంలో తామందర్నీ ఒక తాటిపైకి తెచ్చి కంగారు పడొద్దు అని చెప్పిన దుగ్గన్న బాబ్జి వద్దకు వచ్చిన కొంతమందితో మీటింగ్ ఏర్పాటు చేసి మన నాయకుడు నిస్వార్థపరుడు మంచి వ్యక్తి మనకి అన్యాయం జరగదని చెప్పి రాబోయే కాలంలో పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని నచ్చచెప్పి లోకల్ ఎన్నికలకు మనం అందరం సమసిద్ధంగా ఉండాలని చెప్పినందుకు జనసేన పార్టీలోనే ఉంటూ చిల్లర రాజకీయాలు చేస్తున్న కొంతమంది నాయకులు తమ నాయకుడు బాబ్జి పై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని దుగ్గన వీర మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలల క్రితం జరిగిన ఆస్తి తగాదాలో బాధితుల తరఫున న్యాయం చేసేందుకు దుగ్గన బాబ్జి నిలబడితే దానిని సాకుగా చూపి ఆయన్ను రాజకీయంగా బద్నాం చేద్దామని తమ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని వీర మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా తమ అభిమాన నాయకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏ నిర్ణయం తీసుకున్న జనసేన గెలుపునకు మేము చేసిన ప్రయత్నాన్ని గుర్తిస్తారని జన సైనికులకు వీర మహి ళలకు అండగా నిలిచి పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తారని ఇప్పటికి కూడా అదే మాట మీద నిలబడి ఉన్నామని వారు తెలిపారు. పవన్ కళ్యాణ్ బాధితులు తరపున ఆయన ఏ విధంగా పోరాడుతారో చూసే తామంతా జనసేనకు వచ్చి ఈ పార్టీలో ఉన్నామని ఇది జనసేనలో అధికారం అనుభవిస్తున్న ప్రతి ఒక్క నాయకుడు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జనసేన నాయకులు కొంతమంది తమ స్వలాభం కోసం రాత్రులు వైసిపి తోను పగలు జన సేన లోనూ ఉంటూ తమ పబ్బం గడుపుకునే కొంపల్లి సత్య వంటి మహిళలను ప్రోత్సహించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ఇటువంటి వారిని ప్రోత్సహిస్తున్న నాయకులు వత్తాసు పలకడం వల్ల జనసేన పార్టీకి తీవ్ర నష్టం కలుగు తుం దని కేవలం ఇదే ఆవేదన తప్ప వేరే ఆలోచన తనకు లేదని బాబ్జి అన్నారు. నష్టపో యిన బాధితుల తరఫున పోరాడమే తమ తప్పయితే చెప్పాలని అన్నారు. దుగ్గన బాబ్జి బై జరుగుతున్న రాజకీయ కుట్రలో భాగమే తప్ప వేరేది లేదని వీర మహిళలుగా తాము చెప్తున్నామని రాయుడు దుర్గ, బట్టులీల, బోడపాటి మరియా, ఈ విషయాన్ని ఖండించారు.

ఆట్టహాసంగా ఆరంభమైన శరన్నవ రాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలంలో దేవి నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దేవరపల్లి బాలదుర్గమ్మ యాదవులు రోడ్డు మూడు బొమ్మల సెంటర్ వద్ద గల సౌభాగ్య దుర్గంబిక పల్లపు వీధి రామాలయంలో ప్రతిష్టించిన అమ్మవారు విజయ దుర్గ అమ్మవారు మొదటి రోజు సోమవారం శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక పురోహితులు అఖండం వంశీకృష్ణమూర్తి అమ్మవారి కి ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. కామిశెట్టి దుర్గారావు శిరోమణి దంపతులు పీటల మీద కూర్చుని పూజా కార్యక్రమం నిర్వహించారు. దేవరపల్లిలో గల విజయ దుర్గ ఆల యంలో పల్లపు వీధి రామాలయంలో ప్రతిష్టించిన అమ్మవారు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు మండలంలో పల్లంట గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరిం చారు అదేవిధంగా పలంటోడని చెరువు వాజ కొలువైన శ్రీయ విజయ కనకదుర్గ దేవి ఆలయ వద్ద దేవీ నవరాత్రులు మహోత్సవాలు సంద ర్భంగా ప్రత్యేక పూజలు భవనీలు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు మండలంలో దుద్దుకూరు గౌరీపట్నం ఎర్నగూడెం కృష్ణం పాలెం ధూమంతునిగూడెం సంగాయిగూడెం యాదవోలు త్యాజంపూడి చిన్నాయగూడెం గ్రామాలలో అమ్మవారిని బాల త్రిపుర సుందరి దేవిగా అలంక రించారు మండలంలో అన్ని గ్రామాలలో దేవి నవరాత్రి ఉత్సవాలు శోభను సంతరించుకున్నది. దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ కోశా ధికారి కామిశెట్టి దుర్గారావు కమిటీ సభ్యులు పెన్మమనే వెంకటకృష్ణ గారపాటి అప్పారావు జాజిమొగ్గలా ప్రభాకరరావు పైడికొండల శివయ్య పైడికొండల వెంకటేశ్వరరావు కామిశెట్టి మంగ మాతు సీత స్థానిక ప్రముఖులు యాగంటి వెంకటేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కడియం : కడియం మండలంలోని పలు గ్రామాలలో సెప్టెంబర్ 22 వ తేదీ సోమవారం నుండి శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పలు ఆలయాలు కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కడియం గ్రామంలోని శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ మాట్లా డుతూ అక్టోబర్ 2 వ తేదీ గురువారం వరకూ 11 రోజుల పాటు శ్రీదేవీ శరన్నవరాత్రులు జరుగుతా యని, ఒక్కో రోజు ఒక్కొక్క అలంకరణలో అమ్మ వారు దర్శనమిస్తారని తెలిపారు. కడియపు లంక శ్రీ అపర్ణా సమేత అనంతే శ్వర స్వామి ఆల యం లోనూ, మురమండ శ్రీ కనకదుర్గమ్మ ఆల యంలోనూ శ్రీదేవీ నవరాత్రి మహోత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

విశాలాంధ్ర - పెద్దాపురం : శరన్నవ రాత్రి ఉత్సవాలు అట్ట హాసంగా ఆరంభమయ్యాయి. పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సోమవారం వనదుర్గాలయాలు భక్తి సంగీతాలతో మారు మోగాయి. ఉదయం నుంచి అమ్మవారికి ఏకాంత సేవలు, భజన సంగీతాలతో పాటు ఏటిపట్టు గ్రామాల్లో ఆలయ కమిటీల ప్రత్యేక పూజలతో అమ్మవారికి దూపదీప నైవేద్యాలను సమర్పించి అత్యంత ఘనంగా శరన్నవ రాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

భువనేశ్వరి పీఠంలో : స్థానిక వర్డుల వారి వీధిలో వెలసిన భువనేశ్వరి అమ్మవారిని దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రదర్శన నిర్వహించారు. భువనేశ్వరి అమ్మవారు తొలిరోజు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ గత 26 ఏళ్లుగా అమ్మవారి పీఠంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నా యన్నారు. ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుండి సాయంత్ర 6 గంటల వరకు అమ్మవారి పూజలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మ, నూకాలమ్మ ఆలయాల్లో : కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు విజయలక్ష్మి రాంబాబు రెడ్డి పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లు బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

విశాలాంధ్ర - సామర్లకోట : దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సామర్లకోట పట్టణ, మండల పరిధిలో వివిధ ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. సామర్లకోట అయోధ్య రామపురం శ్రీ సత్తమ్మ అమ్మవారి ఆలయం వద్ద, కొత్తూరు శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద, బ్రౌన్ పేట కనకదుర్గమ్మ ఆలయం వద్ద, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద, బదేలమ్మ చెరువు వద్ద గల శ్రీ నవదుర్గాలను వద్ద, కొత్తూరు నంబర్ టు మార్కెట్ వద్ద, గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న అమ్మవారి ఆలయంలో తెల్లవారుజాము నుండి అమ్మవారికి విశేష పూజలను మరియు లలితా దేవి సహస్రనామ పారాయణ పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు 22 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తామని, బాలా త్రిపుర సుందరి అమ్మవారు నవ రాత్రులు మహోత్సవాలు తొమ్మిది రోజులు రోజు కొక అలంకరణలో భక్తులకు అమ్మ వారి దర్శన భాగ్యం కలగనిందని ఈవో నీలకంఠం తెలిపారు.

విశాలాంధ్ర - కలిదిండి: దేవీ నవరాత్రులు సందర్భంగా గంగానమ్మ అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మండలంలోని పడమటి పాలెం గ్రామంలో గంగానమ్మ గుడి వద్ద దేవీ నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. గంగానమ్మ మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు ద్వాదశ. అశ్విని కుమార్ ఆధ్వర్యంలో పరస. సాంబశివ రావు, శిరోమణి దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. పాము. వీర వెంకట రవికుమార్, సుధాబత్తుల. నరసింహారావు, పిండి. తాతయ్య, పెమ్ము. బాలయోగి, కలిదిండి. నాగరాజు, గోం డ్రాల. శేషయ్య, గుర్రాల. నాగేశ్వరావు, పిండి. నాగరాజు, మురళి, బాలు, ధనరాజ్, జానీ, నాగరాజు, శ్రీను,గోల్కొండ. రంగా, భోగి రెడ్డి, ముసలయ్య, చిట్టూరి. అర్జున్ రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో వైసీపీనేత మురళి రాజు పర్యటన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఎంఎంఆర్ ట్రస్ట్ తరపున ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తామని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళి కృష్ణం రాజు అన్నారు. మండలంలోని ధర్మ వరం గ్రామంలో పర్యటించి నూలు భావన ఋషి ఇటీవల కాలంలో అనారోగ్యంకు గురికావడంతో వారిని పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందిం చారు. మురళి రాజు మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరపున ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోని అండగా ఉంటానని భరోసా కల్పి స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నానిపల్లి చంటి, కోల తాత బాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొర బాబు, రాయుడు దొర బాబు, గుద్దటి రమేష్, గిడుతూరి రాంబాబు, నూలు రమణ, నూకరాజు, శ్రీను, వెంకటేష్, పుత్రయ్య, వీరబాబు, కడారి శ్రీను పాల్గొన్నారు.

ఎం.వి.ఆర్ పాఠశాలలో దసరా వేడుకలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : తెలుగువారి సాంప్రదాయ పండుగలను విద్యార్థులకు తెలియచేయడం కోసం దసరా ఉత్సవాలు ఎం.వి.ఆర్ పాఠశాల ఆవరణలో నిర్వహించినట్టు విద్యాసంస్థల కరస్పాండెంట్ రవి మహేష్ పేర్కొన్నారు. మండలంలో సరిపల్లి ఎం.వి.ఆర్ స్కూల్ విద్యార్థినిలు శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద వివిధ రూపాలలో విద్యార్థినిలు ప్రదర్శన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలం నరేష్, మద్దు తేజ, పాల్గొన్నారు.